క్లుప్తంగా

సరుకుల పంపిణీ



ఏటూరునాగారం : తాడ్వాయి మండలంలోని మేడారం కాలనీలో గత నెలలో వరదలతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీఓ అంకిత్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏడు కుటుంబాలకు ఐటీడీఏ ద్వారా రూ.3750 విలువైన నిత్యవసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎస్ఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పురస్కారం



ములుగు : అంతర్జాతీయ డాక్టరేట్ అవార్డు గ్రహీత పోరిక శ్యామలనాయక్ జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఆయనకు హైదరబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఫౌండర్ రమేష్ పురస్కారం అందజేసి అభినందించారు. సుమారు 50 ఏళ్ల కళా జీవితాన్ని సఫలం చేసినందుకు, కుటుంబంలో అందరిని కళాకారులుగా తీర్చిదిద్దినందుకు పురస్కారం అందజేశారు.

ఆలయంలో శ్రావణ మాస పూజలు



ఏటూరునాగారం : శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తాడూరి రఘు, భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పూజలు చేశారు. అర్చకుడు రాజ్‌కుమార్ హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఓటరు నమోదుపై అవగాహన



వెంకటాపురం (కె) : మండలంలోని బర్లగూడెం పంచాయతీలో ఓటరు నమోదుపై సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం అవగాహన కల్పించారు. అలాగే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం వివరించేలా కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు రాగల శంకర్, మార్త రవి, బుచ్చన్న, రహీముద్దీన్, సాగర్, తిరుపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ములుగు రూరల్ : గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన కొండవీటి వెంకటేశ్వర్‌రావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సోమవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేలు సాయం అందించారు. అండగా ఉంటానని చెప్పారు.

అందుబాటులో ఉండాలి

కన్నాయిగూడెం : వర్షాకాలం నేపథ్యంలో వైద్యులు ప్రజలు అందుబాటులో ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉండి ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మండలంలో గడచిన 15 రోజుల్లో ఐదుగురు జ్వరాల బారిన పడి మృతి చెందారని ఆందోళన వెలిబుచ్చారు. వైద్యులు ఆస్పత్రుల్లో 24 గంటలూ అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయించాలని కోరారు.

కరపత్రం ఆవిష్కరణ

కాటారం: పీవీ.నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, పశువైద్య, పశుసంవర్థక శాఖ సయుక్త ఆధ్వర్యంలో పశుధన్ జాగృతి అభియాన్‌లో భాగంగా ఈనెల 16న మండల కేంద్రంలో ప్రత్యేక పశువైద్య శిబిరం, పాడి రైతుల అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, అధిపతి డాక్టర్ ఎస్.రాజన్న తెలిపారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలను కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. వైద్య శిబిరం, పాడి రైతుల అవగాహన కార్యక్రమంపై స్థానిక పశువైద్య అధికారులతో చర్చించారు. శిబిరం, అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్య క్రమంలో జిల్లా పశు వైద్య, పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ రంగారావు, మండల వైద్యాధికారి రాకేశ్‌శర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఏటూరునాగారం : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ విమర్శించారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన సమ్మెను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సరైన వేతనాలు అందక, ఇతర సమస్యలతో సతమతమౌతున్నారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యూటీ వర్తింపజేయాలని, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీచర్ల, ఆయాల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరోజన, సమ్మక్క, నాయకులు రుద్రమదేవి, జమున, సరిత, లలిత, జయలక్ష్మీ, వెంకటేశ్వరి, సూరమ్మ, అరుణ, ఇందిర, మార నాగలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం : మాట్లాడుతున్న దావూద్

వెంకటాపురం (కె) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన సమ్మెను సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్‌రావు ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణకుమారి, మీనాకుమారి, సమ్మక్క, అరుణ, రత్నకుమారి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అరెస్టు, విడుదల

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో అంగన్‌వాడీలు సమ్మె చేపడుతుండగా పోలీసులు టెంట్‌ను తొలగించి వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు. అనంతరం వారిని వదిలేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడారు. అక్రమ అరెస్టులకు ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. పదిహేను రోజుల క్రితమే అంగన్‌వాడీల జేఏసీ ఆధ్వర్యంలో కమిషనర్‌కు సమ్మె నోటీసు అందించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మోక్షారాణి, పద్మ, భాగ్యలక్ష్మీ, స్వరూప, అలివేలు, రాధిక పాల్గొన్నారు.



ములుగు రూరల్ : పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న రాజేందర్, అంగన్‌వాడీలు



వెంకటాపురం(కె) : మాట్లాడుతున్న మల్లిఖార్జున్

‘గృహలక్ష్మి’ బీఆర్ఎస్ కార్యకర్తల కోసమేనా?



ఏటూరునాగారం : డీటీకి వినతిపత్రం అందజేస్తున్న వెంకన్న, తదితరులు

ఏటూరునాగారం : గృహలక్ష్మి పథకం బీఆర్ఎస్ కార్యకర్తల కోసమే తీసుకొచ్చారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న మండల అధ్యక్షుడు చిటమట రఘు ప్రశ్నించారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకన్న, రఘు మాట్లాడారు. ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులను ఎంపిక చేయడంలో మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డిప్యూటీ తహసీల్దార్ నిరీక్షకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆయూబ్, ఖలీల్, నర్సింహులు, సులేమాన్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ తాడ్వాయిలో..

ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు అనంతారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మాజీ చైర్మన్ పాక సాంబయ్య, సర్పంచ్ ఇర్ప సునీల్, ఎంపీటీసీ మేడిశెట్టి జయమ్మ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముజాఫర్ హుసేన్, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ సృజన, మండల యూత్ అధ్యక్షులు కోడి సతీష్, సింగిల్ విండో డైరెక్టర్ సిద్దిరెడ్డి, నాయకులు పాక రాజేందర్, వెంకన్న,నరేష్, నారాయణ, దుర్గం రవి, తదితరులు పాల్గొన్నారు.

నేతకానీలకు సమాన హక్కులు కల్పించాలి



వెంకటాపురం (కె) : ఏజెన్సీ ప్రాంతంలో నేతకానీ కులస్తులకు ఆదివాసీలతో సమానంగా హక్కులు కల్పించాలని నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జాడి ఈశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడారు. ఏజెన్సీలో నివసిస్తున్న నేతకాని కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. ఏజెన్సీలో నివసిస్తున్న నేతకాని కులస్తులకు ఆదివాసీలతో సమానంగా హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. ఈ క్రమంలోనే సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డు ద్వారా తెలియజేసేలా ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు.

జీఓ నంబర్ 3ను అమలు చేయాలి

ఎస్ఎస్ తాడ్వాయి : షెడ్యుల్ ప్రాంతంలో ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగోన్నతుల్లో జీఓ నంబర్ 3ను అమలు తప్పనిసరి అని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (ఏటీఎఫ్) జిల్లా అధికార ప్రతినిధి సిద్దబోయిన స్వామి స్పష్టం చేశారు. మండలంలోని మేడారంలో కుడుముల శేషగిరి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో స్వామి పాల్గొని మాట్లాడారు. 5వ షెడ్యుల్‌లో ఉపాధ్యాయ నియామకాలు, బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో జీఓ నంబర్ 3 అమలు చేయాలని భారత రాజ్యాంగంలో పొందుపర్చినట్టు తెలిపారు. జీఓ నంబర్ 3పై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయగా ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటోందని ఆశిస్తున్నామని చెప్పారు. జిల్లా ఏజెన్సీలో ఉన్న క్రమంలో అన్ని యాజమాన్య లోకల్ బాడీస్, గవర్నమెంట్ పాఠశాలల్లో జీఓ నంబర్ 3 ప్రకారమే బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని అధికారులు కోరుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జీఓ నంబర్ 3 అమలు చేయకుంటే ఉపాధ్యాయులు, నిరుద్యోగులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో ఏటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం అభినందనీయం

కన్నాయిగూడెం : బాధిత కుటుంబాలకు ముప్పనపల్లి సహాయ నిధి వాట్సప్ గ్రూప్ సభ్యుల సాయం అభినందనీయమని అడ్మిన్ అబ్బు సతీష్ తెలిపారు. మండలంలోని ముప్పనపల్లి గ్రామానికి చెందిన ఎరినవేని సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కూతురుకు ఆ గ్రూప్ ద్వారా సోమవారం రూ.20 వేల సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రూప్ అడ్మిన్ సతీష్ మాట్లాడారు. బుట్కాయిగూడెంకు చెందిన సునార్కని ఆనందరావు రెండ్రోజుల క్రితం మృతి చెందగా సభ్యుల సహకారంతో బాధిత కుటుంబానికి రూ.50 వేల సాయం అందించినట్టు తెలిపారు. మరుసటి రోజే సమ్మక్క కూతుకు సాయం అందించేందుకు సభ్యులు తోడ్పాటు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీదరి సుమన్, సత్యనారాయణ, నర్సింహారావు, విజయ్, గంగరాజు, రియాజ్, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న సతీష్, తదితరులు

దెబ్బతిన్న రహదారుల పరిశీలన

కాటారం: కాటారం నుంచి మంథని వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయవడంతో సోమవారం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక లారీలు అధిక లోడ్‌తో వెళ్లడంతో రహదారి పెద్ద పెద్ద గుంతలమయంగా మారిపోయిందని వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిల్వడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అధికలోడ్‌తో వెళ్తున్న లారీలను అదుపు చేసి రోడ్లు ధ్వంసం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వే బిల్ లేకుండా ఇష్టానుసారంగా ఇసుక మాఫియా చేస్తూ ఇసుక లారీలు అతివేగంగా వెళ్లడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. గుంతలమయమైన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే ఫోన్‌లో కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కొట్టె శ్రీహరి తదితరులు ఉన్నారు.



రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

టేకుమట్ల: పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్లు ఈర్ల పూర్ణిమ, పెండెం హేమలత ఈర్ల రజిత అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్(వీ) అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ అడగాని లతారామారావు ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి, పిల్లలకు అన్నప్రసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్డు, పప్పులను ఎక్కువ మోతాదులో తీసుకుని మాంసాహారాన్ని తక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. బిడ్డకు ఆరు నెలలు నిండగానే తల్లిపాలతో పాటు, అదనపు ఆహారాన్ని అందించాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు ప్రోటీన్స్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, చిరుధాన్యాలతో ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన, ఉపాధ్యాయులు కుడికాల శ్రీనివాస్, స్వామి, ఉప సర్పంచ్ అచ్చె కుమారస్వామి, ఆశవర్కర్లు సారమ్మ, రజిని, లావణ్య పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సిబ్బంది

మరమ్మతులు చేపట్టాలి

చిట్యాల: మండలంలోని నవాబుపేట-టేకుమట్ల మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామాల మధ్య వర్షాలకు వంక సముంద్రం చెరువుకట్ట తెగి రోడ్డు మొత్తం కొట్టుకపోయిందని సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఏమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఓదేలు కోరారు. సోమవారం గండిపడిన చెరువు దగ్గర ఆయన పరిశీలించారు. రోడ్డు మొత్తం తెగిపోవడంతో రెండు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయని తెలిపారు. కావున అధికారులు వెంటనే రెండు గ్రామాలకు రాకపోకలు నడిచేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేరేళ్ల రవి, ప్రశాంత్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్య పరిష్కరించాలని వినతి



వెంకటాపురం (కె) : మండలంలోని దానవాయిపేట గిరిజనుల భూసమస్య పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ సీనియర్ నాయకుడు పూనెం సాయి ఆధ్వర్యంలోని బృందం ఏటూరునాగారంలోని ఐటీడీఏ పీఓ అంకిత్‌కు సోమవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సాయి మాట్లాడారు. దానవాయిపేట ఆదివాసీల అసైన్డ్ భూములకు తక్షణమే సర్వే చేసి అర్హులకు అప్పగించాలని కోరారు. గత కొన్నేళ్లుగా ఆదివాసీలు సదరు భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అట్టం నాగేశ్వర్‌రావు, నాగరాజు, సత్తెమ్మ, చిన్ని, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీలు



టేకుమట్ల: హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ ఆధ్వర్యంలో ఆర్ఎంపీ, పీఎంపీలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంతోపాటు, కాటారం సబ్‌డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించినట్లు కత్తి సంపత్ తెలిపారు. అలాగే ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్‌తో చర్చించాలని కోరినట్లు తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన

● ములుగు ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్ : కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని ఆ పార్టీ జాతీయ నేత, స్థానిక ఎమ్మెల్యే సీతక్క తెలిపారు. గోవిందరావుపేట మండలంలోని చల్వాయి, ప్రసా గ్రామాల నుంచి సుమారు 80 మంది కాంగ్రెస్‌లో సోమవారం చేరగా సీతక్క వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. బీఆర్ఎస్ మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీలని ్నటిసీ విస్మరించిందని తెలిపారు. ప్రజలు బీఆర్ఎస్ పట్ల విసుగు చెందారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ధరణి పోర్టల్‌ను రద్దు చేయడంతోపాటు మేనిఫెస్టోలోని అన్ని హామీలనూ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి దిశగా పోరాడతానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్, వెంకన్న, ప్రభాకర్, సాంబయ్య, ఉమదేవి నరేందర్, నాగలక్ష్మీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న సీతక్క

ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

● జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ములుగు రూరల్ : ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి తెలిపారు. గోవిందరావుపేటలో ఏర్పాటు చేసిన పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం మండలంలో పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత పీఆర్ ఇంజనీరింగ్ అధికారుల మీదే ఉందన్నారు. అధికారులు అభివృద్ధి పనుల్లో నాణ్యత పర్యవేక్షించాలని చెప్పారు. అనంతరం పీఆర్ శాఖ డీఈ చందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నాగజ్యోతిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్, ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ హరిబాబు, ఎంపీడీఓ ప్రవీణ్, మండల అధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.



పీఆర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాగజ్యోతి

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య రక్షణ



వెంకటాపురం (కె): పరీక్ష చేస్తున్న డాక్టర్ భవ్యశ్రీ



కన్నాయిగూడెం : బాలికను పరీక్షిస్తున్న డాక్టర్

వెంకటాపురం (కె) : పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య రక్షణ సాధ్యమని ఎదిర పీహెచ్‌సీ వైద్యాధికారి భవ్యశ్రీ తెలిపారు. మండలంలోని బర్లగూడెం, ఎస్సీ మర్రిగూడెం గ్రామాల్లో సోమవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల్లో ఆమె మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

కన్నాయిగూడెం : మండలంలోని ముప్పనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బోరుగూడెంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ అభినవ్ మాట్లాడారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయడంతోపాటు మందులు అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

‘స్పోర్ట్స్ స్కూళ్ల’కు విద్యార్థుల ఎంపిక

ఎస్ఎస్ తాడ్వాయి : స్పోర్ట్స్ స్కూళ్లలో చదువుకునేందుకు మేడారంలోని ఇంగ్లిష్ మీడియం ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం టి.సరోజన, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న చౌలం బిందు హైదరాబాద్‌లోని హకీంపేట, సుతారి వర్షిత కరీంనగర్‌లోని రీజినల్ స్పోర్ట్స్ స్కూళ్లలో సీట్లు పొందినట్టు ఫిజికల్ డైరెక్టర్ జి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలలకు నిర్వహించిన ఎంపిక పోటీల్లో బిందు, వర్షిత పాల్గొని ప్రతిభ చాటినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.తేజ, కృష్ణ, జి.సమ్మయ్య, లక్ష్మీనారాయణ, కె.వెంకటేశ్వర్లు, వై.సుమలత, సుశీల, దేవేంద్ర, రమణ, సృజన, డిప్యూటీ వార్డెన్ అశ్విని, ప్రశాంతి, సరస్వతి, ఏకాంబరం, సర్దార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

పల్లెల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం

వాజేడు : మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి, ప్రగళ్లపల్లి జీపీల్లో కార్యదర్శులు నరేష్, రేఖాశ్రీ పారిశుద్ధ్య పనులను సోమవారం ముమ్మరం చేశారు. కార్మికులు కాల్వల్లోని మురుగునీటిని తొలగించారు. నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేశారు. బావుల్లో, చేతి పంపుల్లో బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిని పోశారు. రహదారుల వెంట, జనావాసాల్లో, పాఠశాలల ఆవరణల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. నీటి గుంతల్లో టీమోపాస్ మందును పిచికారీ చేశారు. పలు ప్రాంతాల్లో గడ్డి నివారణకు మందు కొట్టారు. సాయంత్రం ఫాగింగ్ చేశారు.



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికులు

‘అటవీ’ అమరుల త్యాగాలు మరువలేనివి

ఏటూరునాగారం : అటవీ శాఖలో విధులు నిర్వహిస్తూ అమరులైన వారి త్యాగాలు మరువలేనివని రేంజ్ అధికారి నరేందర్ తెలిపారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నరేందర్ మాట్లాడారు. విధి నిర్వహణలో ఇప్పటివరకు పలువురు అధికారులు, సిబ్బంది ప్రాణత్యాగాలు చేశారని చెప్పారు. వారి త్యాగాల ఫలితంగానే అడవులు సస్యశ్యామలంగా ఉన్నాయని చెప్పారు. ఏటా వారి స్మారకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ ఉద్యోగులు అఫ్సరున్నీసా, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ ఉద్యోగులు